పునాదికి ఎంత ఖర్చయింది, స్థంభాలకి ఎంత ఖర్చయింది, మొత్తం ఎంత ఖర్చయింది, పాలరాతి పలకలని ఎక్కడ నించి ఎన్ని తెప్పించారు మొదలైన వివరాలన్నీ తన ప్రసంగంలో చెప్పాడు. చివరగా ముఖ్య అతిథి అయిన రామ భక్తుడ్ని మాట్లాడమని కోరాడు. అతను లేచి నిలబడి క్లుప్తంగా రెండు ముక్కలు సందర్భోచితంగా మాట్లాడి కూర్చున్నాడు.

"అంతా ఈ ఆలయం ఎంత గొప్పది, దీనికి సహాయం చేసినవారు ఎంత గొప్పవారు అని మాట్లాడారు. నేనంటాను, రాముడు ఎంత గొప్ప అని."

## 39. తృప్తికరమైన ధర

ఓ ఊళ్ళోని ఓ పెద్ద నగల దుకాణంలో కుంకుడు కాయంత పెద్ద మంచి ముత్యం అమ్మకానికి ఉంది. దాన్ని కొనడానికి చాలామంది ఆ దుకాణానికి వెళ్ళారు కాని దాని యజమాని దాని ధర అడిగిన వాళ్ళందరికీ ఇలా చెప్పాడు.

"మీ ఆస్తి అంతా మీ దగ్గర చిల్లిగవ్వ కూడా మిగుల్చుకోకుండా ఇవ్వండి. అదే దీని ధర."

దాంతో ఆ ముత్యాన్ని కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు.

చలికాలంలో పొరుగూరు నించి వచ్చిన ఓ బిచ్చగాడు ఓ రోజు ఆ దుకాణం బయట పడుకున్నాడు. కిటికీలోంచి అతనికి ఆ ముత్యం కనబడింది. తన దగ్గర దాన్ని కొనే తాహతు లేదని అతనికి తెలుసు. ఐనా వెళ్ళి దాన్ని దగ్గర నించి చూసాడు. ధైర్యం చేసి ఆ దుకాణం యజమాని దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"ఆ ముత్యం చాలా బావుంది. దాని ధరెంతో నేను తెలుసుకోవచ్చా?"

"తప్పకుండా. నీ ఆస్తి అంతా నీ దగ్గర చిల్లిగవ్వ కూడా మిగుల్చుకోకుండా ఇవ్వాలి. అదే దీని ధర."

వాడు బయటకి వెళ్ళిపోయాడు. కాని ఆ ముత్యం ఆకర్షణలోంచి తేరుకోలేక పోయిన అతను మళ్ళీ దుకాణంలోకి వెళ్ళి తన ఒంటి మీద ఉన్న, తనని చలి నించి కాపాడే చిరుగులు పట్టి, మాసిపోయిన పాత ఉన్నికోటుని తీసి దుకాణం యజమానికి ఇచ్చాడు. ఇప్పుడతని ఒంటి మీద గోచీ కూడా లేదు.

"తృపికరమైన ధర ముట్టింది." చెప్పి, ఆ దుకాణం యజమాని ఆ ముత్యాన్ని ఆ బిచ్చగాడికి ఇచ్చేసాడు.

'మోక్షం' అనే ఆ ముత్యాన్ని అమ్మే దేవుడు నిర్ణయించిన ధర ఇది. 'నాది' అన్నది మిగుల్చుకోకుండా సర్వం దేవుడి చేతిలో మనం పెట్టగలిగితే, ఆ ముత్యం ఎవరికైనా లభ్యమే.

## 40. ఓ డైరీలో కొన్ని పేజీలు

సోమవారం:

ఈ రోజు నేను బస్సులో ఎర్రటి పంజాబీ డ్రస్‌లో ఉన్న ఓ అమ్మాయిని చూసాను. ఆమెలా నన్ను కూడా అందంగా పుట్టించనందుకు నీ మీద నాకు కోపం వచ్చింది. కాని ఆమె తన బస్సు స్టాప్ రాగానే దిగడానికి లేచినప్పుడు ఊత కర్ర సాయంతో బస్సు దిగింది.

నీ మీద కోపం తెచ్చుకున్నందుకు నన్ను క్షమించు దేవా! నాకు నడవడానికి రెండు కాళ్ళు ఇచ్చినందుకు కృతజ్ఞురాలిని.

మంగళవారం:

ఎఫ్ యంలో ఓ డి. జె ఎంతో హుషారుగా మాట్లాడుతూంటే, అతని జీవితం ఖచ్చితంగా ఆనందమయం అయివుంటుంది అని అనిపించింది. నాకు అలాంటి జీవితం ఇవ్వనందుకు నీ మీద మళ్ళీ నాకు కోపం వచ్చినందుకు నన్ను క్షమించు దేవా! ఆ డి జె గుడ్డివాడని ఇందాక పేపర్లో చదివి తెలుసుకున్నాను.

నాకు పని చేసే రెండు కళ్ళని ఇచ్చినందుకు నీకు నేను కృతజ్ఞురాలిని.

బుధవారం:

ఇందిరా పార్క్‌లో స్కూలు యూనిఫారాల్లో వచ్చిన పిల్లలంతా ఆడుకుంటూంటే, చూడముచ్చటగా ఉన్న ఓ పిల్లవాడ్ని చూసి నువ్వు నాకు అలాంటి కొడుకుని ఇవ్వనందుకు నీ మీద మనసులోనే కోపగించుకున్నాను. వారితో కలిసి ఆడుకోకుండా ఒంటరిగా జారుడుబండ మీద జారుతున్న అతని దగ్గరకి వెళ్ళి పేరు అడిగితే బిత్తరపోతూ నావంక చూసాడు.